క్లుప్తంగా

కోడుమూరులో వర్షం

కోడుమూరు రూరల్: మండలంలో 20 రోజుల తర్వాత ఓ మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెలవారుజామున వరకు విడతలు విడతలుగా వర్షం కురవడంతో 19.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇప్పటికే వానల్లేక ఖరీఫ్ కింద వర్షాధారంగా సాగు చేసిన ఉల్లి పంట సగానికి పైగా ఎండిపోగా, పత్తి, కంది, సజ్జ వంటి పంటలు వాడుముఖం పట్టాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సి.బెళగల్: మండలంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు గూడూరు విద్యుత్ సబ్‌డివిజన్ అధికారులు తెలిపారు. మండలంలోని ఐదు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణ, మరమ్మతులలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.కొత్తకోట, సి.బెళగల్, గుండ్రేవుల, పోలకల్, బురాన్‌దొడ్డి సబ్ స్టేషన్ల పరిధిలోని కరెంట్ కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మండలమీట్

కోడుమూరు రూరల్: గూడూరు మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మధులత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సునీత ఆధ్వర్యంలో జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని, అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం కాల్వబుగ్గ బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్త మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 మంది సభ్యులతో కూడిన ధర్మకర్త మండలిని నియమించనున్నామని, అర్హత, ఆసక్తి ఉన్న వారు 20 రోజుల్లోగా దరఖాస్తులను దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కాల్వబుగ్గ ఆలయ కార్యనిర్వహణాధికారిని సంప్రదించాలన్నారు.

గుండెపోటుతో కటికె రాజన్న మృతి

పాణ్యం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కటికె రాజన్న(57) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తెల్లవారుజామున గుండెపోటు రావడంతో శాంతిరామ్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు పాణ్యం ఎంపీపీ ఉసేన్‌బీ సోదరుడు. చందమామ హోటల్ ద్వారా అందరికీ సుపరిచితుడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉండడంతో ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డితోపాటు పాణ్యం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

ప్రజారోగ్యంపై సర్వే



పాణ్యంలో సర్వే చేస్తున్న సర్వే సిబ్బంది

పాణ్యం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఎస్ఏ(నేషనల్ స్టాటిస్టిక్ ఆఫీస్) సర్వేలో భాగంగా సిబ్బంది పాణ్యంలో శుక్రవారం సర్వే చేపట్టారు. సర్వే పర్యవేక్షణ అధికారులు సాంబశివుడు, శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి కుటుంబ ఆరోగ్య విషయాలు తెలుసుకునేందుకు సర్వే ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో గణాంక అధికారులు అఖిల్, వెంకటేష్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి



శ్మశాన సమస్యపై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ నాయకులు

కర్నూలు(రూరల్): మండల పరిధి బి.తాండ్రపాడులోని శ్మశానంలో దళితుల మృతదేహాలు పూడ్చకుండా అగ్రకులాలవారు అడ్డుకుంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని దళితులు కలిసి కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను పసుపులలోని ఆయన స్వగృహంలో కలిసి అర్జీ ఇచ్చారు. గ్రామ సర్వే నంబర్ 56లో రెండు ఎకరాల శ్మశాన వాటిక ఉందని ,అందులో బ్రిటిష్ కాలం నుంచి ఒక ఎకరంలో బీసీ లను ,మరొక ఎకరంలో ఎస్సీలను ఖననం చేస్తున్నారని చెప్పారు. ఇప్పుడు బీసీ కులాలు వారు శ్మశానవాటికలో ఎస్సీలను ఖననం చేయరాదాని అడ్డు తగులుతూ దౌర్జన్యం చేస్తూరని అర్జీలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



పాణ్యంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు చేసిన దృశ్యం



ఎస్ కొత్తూరులో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. పలు గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలతో అలంకరించారు. పూజలకు హాజరైన మహిళలకు దేవస్థానం వారు ఉచితంగా టెంకాయ, రవికె, పూలు, గాజులు, పసుపు, కుంకుమ, లడ్డూ ప్రసాదాలు అందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్రతం కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ పాల్గొన్నారు.

● పాణ్యం కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతం

కోడుమూరు రూరల్: పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక శ్రీవరలక్ష్మి వ్రత మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్, భారతీ సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన సామూహిక వ్రతాల్లో మహిళలు పాల్గొని సామూహిక వ్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మహిళలు తమ ఇళ్లలో కూడా శ్రీవరలక్ష్మీ అమ్మవారిని ప్రతిష్ఠించి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

భోగేశ్వరంలో ..

గడివేముల: భోగేశ్వరంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారికి శ్రావణ మాసం శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు గిరినాథశర్మ అమ్మవారిని గంధచందనాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు. అలాగే దుర్గాభోగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్థానిక కాశిరెడ్డినాయన ఆశ్రమంలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. స్థానిక మూలపెద్దమ్మ, బాలాజీ ఆలయాలతో పాటు గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



పూజలందుకున్న దుర్గాదేవి అమ్మవారు

మంచినీటి బోర్ల మరమ్మతుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్



కొత్తపల్లెలో మంచినీటి బోరు బాగు చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామంలో పాడైన బోర్ల మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామానికి మంచినీటినందించే బోర్లు పని చేయకపోవడంతో గ్రామస్తులు కిలోమీటర్ల దూరాన వ్యవసాయ బావులు, బోర్లను ఆశ్రయించి మంచినీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉంది. నీళ్ల కోసం వారు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం 'వానాకాలంలోనూ ఎండుతున్న గొంతులు' అన్న శీర్షికన 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు ఆఘమేఘాల మీద మెకానిక్‌ను కొత్తపల్లె గ్రామానికి పంపించి ఒక బోరును అక్కడికక్కడే రిపేర్ చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు పాడైన మరో బోరు మోటార్‌ను రిపేర్ కోసం తీసుకెళ్లారు. ఎట్టకేలకు నీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

అధైర్యపడకండి..అండగా ఉంటా

సి.బెళగల్: అధైర్యపడకండి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ బాధిత కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. మండల కేంద్రం సి.బెళగల్లోని తెలుగు వీధిలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త తెలుగు ఈరన్న గుండెపోటుతో మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన టైలర్ ఆదెన్న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ గ్రామానికి చేరుకొని వారి భౌతికకాయాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. జిల్లా విద్యార్థి విభాగం కార్యవర్గ సభ్యుడు తిరుమలేష్, నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షుడు హరున్, నియోజకవర్గ వలంటీర్ల విభాగం అధ్యక్షుడు మల్లికార్జున, మండల ఉప కన్వీనర్ లచ్చప్ప, మండల కార్యదర్శులు మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, మండల యూత్ వింగ్ అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు ఎస్ఎం బాషా, మహమ్మద్ రఫీ తదితరులు ఈరన్నకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ముందుకు పారని మురుగు!



మురుగు నీటితో నిండిపోయిన డ్రైనేజీ

ఓర్వకల్లు: అధికారుల అనాలోచితం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా కాల్వల్లో మురుగు పారడం లేదు. ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండ్ నుంచి మర్రిచెట్టు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించారు. ఇందులో చర్చివైపు ఉన్న కాల్వను పూర్తి చేయకుండా మధ్యలో నిలిపేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వైపు నిర్మించిన కాల్వ పనులు పూర్తయ్యాయి. కానీ ఆ కాల్వ నీరు ముందుకు వెళ్లేందుకు ఆర్చీ గేట్ కింద కాల్వను నిర్మించి, ఆ కాల్వను కుందూ వాగులో కలపాలి. అయితే కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షనీటితో కాల్వ నిండి, ఎక్కడకు ప్రవహించక కాల్వలోనే నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన వస్తోందని, దోమల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం రిజిస్ట్రార్ కార్యాలయ పనిమీద వచ్చేవారు, రోడ్డుపై నడిచే వారు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స



చికిత్స పొందిన బాలుడితో డాక్టర్లు జానకిరామ్, శ్రీకాంతబాబు

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో అరుదుగా కనిపించే సమస్య క్రానిక్ కాల్సిఫిక్ పాంక్రియాటైటిస్. అంటే దీర్ఘకాలం పాటు క్లోమంలో రాళ్లు ఏర్పడటం. లక్ష మంది పిల్లల్లో 126 మందికి మాత్రమే ఈ సమస్య ఉంటుంది. ఈ సమస్య కారణంగా తీవ్రమైన కడుపు నొప్పి, జ్వరం, ఇతర సమస్యలతో బాధపడుతు న్న రితిక్ అనే పదేళ్ల బాలుడికి కర్నూలు కిమ్స్ ఆస్పత్రి వైద్యనిపుణులు ఫ్రేస్ ప్రొసీజర్ అనే శస్త్రచికిత్స చేసి సమస్య పరిష్కరించారు. వివరాలను శుక్రవారం సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ ఎస్.జె.జానకిరామ్, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఎం.శ్రీకాంత బాబు వివరించారు. 'రితిక్‌కు ఐదేళ్ల వయ సు ఉన్నప్పటి నుంచి సమస్య ఉందన్నారు. దీనివల్ల పాంక్రియాస్ (క్లోమం)లో పెద్ద సంఖ్యలో రాళ్లు ఏర్పడ్డాయి. తద్వారా విపరీతమైన కడుపునొప్పి వచ్చేది. బాలుడిని చికిత్స కోసం తమవద్దకు తీసుకురావడంతో ఎంఆర్ఐ పరీక్ష చేసి సమస్య తెలుసుకున్నాం. పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఎం.శ్రీకాంత బాబు, తాను కలిసి ఫ్రేస్ ప్రొసీజర్ విధానంలో బాలుడి పాంక్రియాస్‌ను తెరిచి రాళ్లను తొలగించాం. పాడైన కొంత కణజాలాన్ని, కొంత చిన్న పేగును కత్తిరించి ఆ రెండింటినీ కలిపి కుట్లు వేశాం. ప్రస్తుతం బాలుడు కోలుకుంటున్నట్లు వివరించారు.

చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కడపాళెం, సిద్దప్ప పాళెం కాలనీలలో వెలసిన తొగట వీరక్షత్రీయుల ఆరాధ్య దైవం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గోవిందు స్వామి ఆధ్వర్యంలో అయా ఆలయాల కమిటీ అధ్యక్షులు ఓంప్రకాష్, డీసీ నారాయణ సమక్షంలో అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాబిషేకం, ఆకు పూజ, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం తుంగభద్ర నది జలాలు, జ్యోతులను, మేళతాళాలు, డప్పువాయిద్యాలు, కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి ఆలయం చెంతకు చేరుకున్నారు. శనివారం వేకువ జామున అమ్మవారి స్వగృహం నుంచి జ్యోతిలను వెలిగించుకుని భజన పాటలతో ఊరేగింపుగా జ్యోతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బృందం తెలిపింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం నుంచి మంత్రాలయం మఠం శ్రీ రాఘవేంద్రస్వామి వారి 354వ ఆరాధన మహోత్సవాలు ప్రారంభమవుతున్నాయని ఆలయ మేనేజర్ భీమసేన శుక్రవారం తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ ఆదేశాల మేరకు మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం రోజున సామూహిక సత్యనారాయణవ్రతం, ధ్వజారోహణం, గోపూజలతో ప్రారంభమై ఆదివారం రోజు వేకువజాము నుంచి ఆరాధన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. నిర్మల విసర్జనం, అష్టోత్తర పారాయణం, క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, తులసీ అర్చన, కనకాభిషేకం, రథోత్సవం, అలంకార బ్రాహ్మణుల ఆరాధన తదితర పూజలు ఉంటాయన్నారు. సోమ, మంగళవారాల్లో కూడా స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు తీర్థ ప్రసాదాలు సమర్పిస్తారన్నారు.



గార్గేయపురం - శివరామాపురం మార్గంలో సాగు చేసిన నారుమళ్లు


పొగాకు సాగుకు సన్నద్ధం

కర్నూలు(రూరల్): పొగాకు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే నారుమళ్లు వేశారు. ఏటా మండలంలో పొగాకు అత్యధికంగా పండిస్తారు. ఈ క్రమంలో ఈసారి కూడా గార్గేయపురం , దిగువపాడు, పసుపుల,పి.రుద్రవరం ,రేమటా, ఉల్చాల, పడిదెంపాడు, తదితర గ్రామాల్లో పొగాకు పంటకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. దిగువపాడు, గార్గేయపురం గ్రామాల్లో నారు నాణ్యంగా ఉంటుందని కొనుగోలుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు వస్తున్నారు. రెండువారాల్లో పొగాకు నాట్లు ముమ్మరం కానున్నాయి.



గోపూజలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

సంబరం.. సుమధురం



ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు



ధాన్య పూజలో పీఠాధిపతి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి సన్నిధిలో సంబరాలు సుమధురంగా సాగాయి. శుక్రవారం ఉత్సవాలు ప్రారంభంలో భాగంగా పూజా ఘట్టాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా ధర్మవరానికి చెందిన లలితా నికేతన్ బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన, కర్ణాటకలోని మాలూరుకు చెందిన ప్రసన్న కూర్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే శ్రీమఠం ఊంజల మంటపంలో చేపట్టిన ధాన్య పూజ భక్తులను మైమరిపించింది. రాఘవేంద్రస్వామి అనుగ్రహంతో సప్తరాత్రోత్సవాలను జయప్రదం చేద్దామని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పిలుపునిచ్చారు. స్వామి సేవలో భక్తకోటి తరించాలని ఆకాంక్షించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. అలాగే ఆరాధనోత్సవాల విశేషాలను భక్తులకు ప్రవచించారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సుధాకర్ బాబు, పీఈటీ దుబ్బన్న

పెద్దకడబూరు: కల్లుకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ బాబు, పీఈటీ దుబ్బన్న తెలిపారు. పోటీలకు ఎంపికై న విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలులో బుధవారం నిర్వహించిన సబ్ జూనియర్ జూడో పోటీలలో తమ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి నరేంద్ర, 8వ తరగతి విద్యార్థులు కార్తీక్, ఉపేంద్ర, సాగర్, 9వ తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎన్నికైనట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలల కార్యవర్గం ఎన్నిక

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదోని ప్రైవేట్ పాఠశాలల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక అక్షరశ్రీ పాఠశాలలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గోపాల్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ ఎన్నికల్లో గౌరవ సలహాదారులుగా కేశవనారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి అధ్యక్షుడుగా నాగేంద్ర ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి ఆర్థిక కార్యదర్శిగా దశరథ రాముడు ఉపాధ్యక్షులుగా నాగరాజ్, ఉసేనప్ప, హరి పాండురంగ జాయింట్ కార్యదర్శులుగా అఫ్జల్ రెహమాన్, రమేష్ బాబు,వినోద్ రెడ్డి సభ్యులుగా వెంకటేశులు, జనార్దన్, రాజశేఖర్, నాగరాజ్‌ను ఎన్నుకున్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

● ఆదోని డీఎస్పీ హేమలత



మాదక ద్రవ్యాలనిషేధంపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: యువత మత్తు పదార్థాల జోలికెళ్లొద్దని ఆదోని డీఎస్పీ హేమలత సూచించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని రోషన్ గార్డెన్‌లో మాదక ద్రవ్యాల వినియోగం, దానివల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఒత్తిడిని జయించేందుకు అనేక మార్గాలు ఉన్నాయన్నారు. కళాశాల యాజమాన్యాలు చదువుతో పాటు, సాంస్కృతిక, క్రీడలను ప్రోత్సహించాలని, పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల లోపు సిగరెట్లు, మద్యం వంటివి విక్రయించరాదన్నారు. ఈ నిబంధనను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా నేరమేనన్నారు. కేసు నమోదైతే పదేళ్లకు పైబడి జైలు జీవితంతో పాటు, రూ.లక్షకు పైగా జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న వైద్యులు, బాలింతలు

కర్నూలు(హాస్పిటల్): తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీడియాట్రిక్స్, నియోనెటాలజిస్టులు డాక్టర్ ఆర్.మురార్జి, డాక్టర్ కె.సింధూరరెడ్డి, గైనకాలజిస్టులు డాక్టర్ శిల్పాచౌదరి పెద్దపాల్ల, డాక్టర్ టి.జ్యోత్స్న చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులు, బాలింతలకు వైద్యులు వివరించారు. తల్లిపాలలో ఉండే పోషకాలు, రోగనిరోధక శక్తి బిడ్డకు ఆరోగ్యవంతమైన జీవితం అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని, తల్లిపాలతో పెరిగే శిశువులకు జీర్ణసమస్యలు తక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. శిశువులకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే పట్టాలన్నారు. అనంతరం ఆస్పత్రి క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా పిల్లల తల్లులకు బేబీ కిట్స్ అందించారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 9వ తేదీ రెండవ శనివారం కర్నూలు నగరంలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో మె యింటెనెన్స్ పనులు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ అర్బన్ డీఈ నాగప్రసాద్ తెలిపారు. ఇందువల్ల నగరంలో ఉద యం 9 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.